



ఐబీ తండాలో పిడుగు పాటుకు మృతిచెందిన పాడి గేదెలు

అకాలవర్షం.. ఆగమాగం

అల్లాదుర్గం ఏప్రిల్ 19 : అల్లాదుర్గం మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి వరి పంట దెబ్బతినగా, భారీ వృక్షాలు నేలకొరిగాయి. మండలంలోని గడిపెద్దాపూర్, మాందాపూర్, చిల్వర్, అల్లాదుర్గం గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రాంపూర్‌లో వరి పంట నేలకొరిగింది. అల్లాదుర్గం సమీపంలోని అల్లాదుర్గం - వెంకట్‌రావుపేట్ ప్రధాన రహదారిపై భారీ వేప చెట్టు కూలి రోడ్డుపై పడడంతో రాకపోకలు స్తంభించాయి. మాందాపూర్ శివారులో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఐబీ తండా సమీపంలో పిడుగు పడి వర్యా సక్కుబాయి-మారుతి దంపతులకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి.




మాందాపూర్ శివారులో విద్యుత్ తీగలపై విరిగిపడిన చెట్టు

వందశాతం పోలింగే లక్ష్యం : కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 19 : లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదుకావడమే లక్ష్యంగా ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఓటరు అవగాహన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ ఓటరు తప్పనిసరిగా ఓటేయాలని కోరారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఓటర్లంతా స్వేచ్ఛగా ఓటుహక్కుని వినియోగించుకుని పోలింగ్ శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ నర్సింహారావు, రైతు సమన్వయ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో ఎడ్లబండిపై సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి



ఇందిరమ్మ అడ్డా.. మెదక్ గడ్డ..

కష్ట కాలంలో గెలిపించిన మెతుకుసీమ


జ్ఞాపకం

- హత్యకు గురయ్యేనాటికి మెదక్ ఎంపీగానే ఇందిరాగాంధీ
- ఇక్కడి నుంచే చివరిసారి ప్రాతినిధ్యం

మెదక్, ఏప్రిల్ 19: దేశ ప్రధాని ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంగా మెదక్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. దేశమంతా కాంగ్రెస్‌కు ఎదురుగాలులు వీస్తున్న తరుణంలో ఇందిరాగాంధీని లోక్‌సభకు పంపించి దేశవ్యాప్తంగా చర్చలో నిలిచింది. దేశంలో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత 1977లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైంది. ఇందిరాగాంధీ కూడా రాయ్‌బరేలీలో జనతా కూటమి అభ్యర్థి రాజ్‌నారాయణ్ చేతిలో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించిన జనతా కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ పలు పార్టీల కలయికతో ఏర్పడిన జనతా ప్రభుత్వం ఆ తరువాత జరిగిన పరిణామాలతో కూలిపోయింది. దీంతో 1980లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో ఇందిరాగాంధీ రాయ్‌బరేలీతో పాటు మరో సురక్షిత స్థానంలో పోటీ చేయాలని భావించారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ కంచుకోటగా పేరున్న మెదక్ నియోజకవర్గంలోనూ పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ ఇందరకు పోటీగా మానవ కంప్యూటర్‌గా పేరున్న శకుంతలాదేవి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. జనతా పార్టీ తరఫున జైపాల్‌రెడ్డి, జనతా(సోషలిస్ట్ పార్టీ) అభ్యర్థిగా మానవహక్కుల ఉద్యమకారుడు కేశవ్‌రావ్ జాదవ్, పీవీ నరసింహారావు కుమారుడు పీవీ రాజేశ్వర్‌రావు తదితరులు మొత్తం పది మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా పోటీలో ఉన్న ఇందిరాగాంధీకి ఎన్నికల ఏజెంటుగా ఓటమి ఎరుగని నేతగా పేరున్న మాజీ మంత్రి బాగారెడ్డి పనిచేశారు. ఇందిరాగాంధీ తొలిసారి దక్షిణ భారత దేశం నుంచి పోటీ చేస్తుండడంతో దేశ ప్రజలంతా ఆసక్తిగా గమనించారు.

అత్యధిక మెజారిటీ

ఈ ఎన్నికల్లో రాయ్‌బరేలీతో పాటు మెదక్ నియోజకవర్గంలోనూ ఇందిరాగాంధీ గెలుపొందారు. మెదక్‌లో 67.9 శాతం ఓట్లతో ఘన విజయం సాధించారు. ఆమెకు దేశంలోనే అత్యధిక మెజారిటీ వచ్చింది. ఇందిరకు 3,15,077 ఓట్లు రాగా.. సమీప ప్రత్యర్థి జైపాల్‌రెడ్డికి 82,483 ఓట్లు వచ్చాయి. కేశవ్‌రావ్ జాదవ్‌కు 26,147 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి శకుంతలాదేవికి కేవలం 6,514 ఓట్లు రావడంతో డిపాజిట్ కోల్పోయారు. అనంతరం ఇందిరాగాంధీ రాయ్‌బరేలీ స్థానానికి రాజీనామా చేసి, మెదక్ నుంచే పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. దేశ ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తరువాత ఆమె పలుమార్లు మెదక్ నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దమొత్తంలో నిధులు కేటాయించారు. అప్పట్లో ఎద్దుమైలారంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని నెలకొల్పారు. మెదక్ పట్టణంలోని పటేల్‌కుంటలో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు స్వయంగా శంకుస్థాపన చేశారు. హవేలీఘనపూర్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. 1984 అక్టోబరు 31న సిక్కు తీవ్రవాదుల చేతిలో హత్యకు గురయ్యేనాటికి ఇందిర మెదక్ పార్లమెంటు సభ్యురాలిగానే ఉన్నారు.



వ్యయ రికార్డులు పక్కాగా నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు

మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల వ్యయ రికార్డులను పక్కాగా నిర్వహించాలని మెదక్, సంగారెడ్డి జిల్లాల ఎన్నికల వ్యయ పరిశీలకులు సునీల్‌కుమార్ రాజ్‌వాన్షీ, మోతీలాల్ ఎస్. పీలే అధికారులను ఆదేశించారు. మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌లలో వారు వేర్వేరుగా అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్లు, నోడల్ అధికారులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీవీటీటీం సభ్యులు పాల్గొన్న ఈ సమావేశాల్లో పలు సూచనలు చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో సహాయ వ్యయ పరిశీలన అధికారులతో సమన్వయం చేసుకొని ఆర్వో స్థాయిలో ప్రతీరోజు వ్యయ నివేదికలను క్రోడీకరించుకోవాలని సూచించారు. నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ఖర్చుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. షాడోటీంల ద్వారా ఎప్పటికప్పుడు ఆయా నియోజకవర్గాల్లో వివిధ పార్టీల అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికయ్యే ఖర్చుల వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

సమావేశంలో మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి, మెదక్, సిద్దిపేట జిల్లాల అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్ మాధురి, నోడల్ అధికారులు బాలశౌరి, అంజయ్య, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌కు మూడు, మెదక్‌కు నాలుగు నామినేషన్లు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 19 : రెండో రోజైన శుక్రవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరూ నామినేషన్‌లను దాఖలు చేయలేదు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి మూడు నామినేషన్లు రాగా, మెదక్‌కు నాలుగు నామినేషన్లు వచ్చాయి. మెదక్ లోక్‌సభకు నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ప్రజా వెలుగు పార్టీ నుంచి సారా యాదగిరి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి గొల్లపల్లి సాయిగౌడ్, స్వతంత్ర అభ్యర్థులుగా బొమ్మల విజయ్‌కుమార్, తుమ్మలపల్లి పృథ్వీరాజ్ తమ నామినేషన్ ప్రతాలను మెదక్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు సమర్పించారు. మెదక్ స్థానానికి తొలిరోజు వచ్చిన నాలుగు నామినేషన్లతో కలిపి మొత్తం ఎనిమిది దాఖలయ్యాయి.

సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో జహీరాబాద్ పార్లమెంట్‌కు స్వతంత్ర అభ్యర్థులు బి.మారుతిరావు, కే.ఆనందీశ్వర్ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా, మహదేవ్‌స్వామి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మొదటి రోజున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున ఒక నామినేషన్ సెట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు జహీరాబాద్‌కు మొత్తం నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, నేరచరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీస్ బోర్డుపై ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎవరైనా పూర్తి వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్ (ఎఫ్ఎఫ్ఐడీఏవీఐటీ.ఈసీఐ.జీవోవీ.ఇన్)లో చూడవచ్చని కలెక్టర్ క్రాంతి తెలిపారు.

చెరువు చిన్నబోతున్నది

రాత్రికి రాత్రే బంధంకొమ్ము చెరువు పూడ్చివేత

- రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపం
- సమాచారం ఇచ్చినా స్పందించని అధికారులు



పటాన్‌చెరు, ఏప్రిల్ 19: అమీన్‌పూర్ జీవవైవిధ్య చెరువుకు అనుబంధంగా ఉన్న బంధంకొమ్ము చెరువు క్రమంగా కనుమరుగయ్యేలా ఉంది. చెరువులో మట్టిని నింపి ఆక్రమిస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వారం రోజులుగా చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున బండరాళ్లు, మట్టి, భవన శిథిలాల వ్యర్థాలను టిప్పర్లలో తెచ్చి రాత్రి వేళ చెరువును పూడుస్తున్నారు. బందంకొమ్ము చెరువు పక్కనే పట్టా భూముల యజమానులు తమ స్థలం ఎత్తు పెంచుకునేందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఎకరాల కొద్ది విస్తరించిన శిఖం, బఫర్ జోన్ పూడ్చివేతతో చెరువు కుచించుకుపోయి క్రమంగా వైశాల్యం తగ్గిపోతోంది. రెండేళ్లుగా చెరువు పెద్ద ఎత్తున కబ్జాల బారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గతంలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన అక్రమ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను నిలిపివేయాలని అప్పటి కలెక్టర్ హన్మంతరావు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేని పరిస్థితి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తం వుతున్నాయి. రోడ్డువైపు చెరువును ఆనుకుని విలువైన భూములు ఉండటంతో నిర్మాణాలు చేపట్టేందుకే ముందస్తు ప్రణాళికలో భాగంగా మట్టితో నింపుతున్నారని తెలిసింది. తాజాగా వివాదాస్పద ఎఫ్‌టీఎల్ పరిధిలోనే మట్టి నింపడం చర్చనీయాంశంగా మారింది.

జీవవైవిధ్య చెరువుకు కబ్జాల గండం

అమీన్‌పూర్ చెరువుకు అనుబంధంగా ఉన్న బంధంకొమ్ము చెరువును సైతం జీవవైవిధ్య చెరువుగా ప్రభుత్వం గుర్తించింది. కాంక్రీటు అరణ్యంలా మారిన అమీన్‌పూర్ పట్టణంలో బంధంకొమ్ము చెరువు భూగర్భజలాలకు ప్రాణాధారంగా ఉంది. ఈ విలువైన చెరువులో కబ్జాలను నియంత్రించేందుకు జీవవైవిధ్య కమిటీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. చెరువు చుట్టు పక్కల పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారం, భారీ బహుళ అంతస్తు అపార్ట్‌మెంట్‌లు రావడంతో భూముల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. బంధంకొమ్ము చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని రైతులు తమ భూములను మునిగిపోకుండా పెద్దఎత్తున మట్టిని నింపుతున్నారని పర్యావరణవేత్తలు, పలు సంఘాలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా క్షేత్రస్థాయిలో చెరువును రక్షించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లుగా గుర్తించిన సర్వే నంబర్లలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకూడదని, మట్టిని నింపకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చెరువును పూడ్చివేసిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేసి పూడ్చిన మట్టిని ఎత్తిపోస్తేనే చెరువు పరిరక్షణ సాధ్యమవుతుంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గొలుసుకట్టు చెరువులో ప్రమాదంలో ఉన్నాయని వాటిని రక్షించాలని హరిత ధర్మాసనం అనేకమార్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిందని జనం కోసం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

చర్యలు తీసుకుంటాం..

అమీన్‌పూర్ పెద్ద బందంకొమ్ము చెరువులో మట్టిని నింపుతున్నారని సమాచారం వచ్చింది. ఆక్రమణాలను అడ్డుకోవాలని మండల ఏఈకి ఆదేశాలు జారీ చేశాం. జీవవైవిధ్య చెరువుగా గుర్తించిన అమీన్‌పూర్ పెద్దచెరువు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఏ మాత్రం ఆక్రమించినా సహించేది లేదు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు జారీ చేయకూడదని స్థానిక మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాం. మట్టిని నింపితే ఆయా సర్వేనెంబర్ల పట్టాదార్లను బాధ్యులను చేసి క్రిమినల్ కేసు నమోదు చేస్తాం. వారితోనే మట్టిని ఎత్తించేందుకు చర్యలు తీసుకుంటాం.

-రామస్వామి, ఇరిగేషన్ డీఈ



సంగారెడ్డి ఎంసీహెచ్‌లోని ఓ వార్డులో బాలింత కుటుంబసభ్యులు ఏర్పాటు చేసుకున్న టేబుల్ ఫ్యాన్

సర్కారు ఆసుపత్రికి ఇంటి నుంచి ఫ్యాన్లు

ఉక్కపోతతో సంగారెడ్డి ఎంసీహెచ్‌లో గర్భిణులు, బాలింతల అవస్థలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) నిత్యం రోగులతో కిటకిటలాడుతుంటుంది. వేసవికాలం గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఆస్పత్రిలో సీలింగ్‌ఫ్యాన్ల నుంచి వచ్చే గాలి సరిపోవడం లేదు. అంతేకాకుండా పలు వార్డుల్లో కొన్ని సీలింగ్‌ఫ్యాన్లు పనిచేయడం లేదు. దీంతో చికిత్స పొందుతున్న రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఉక్కపోతతో ఇబ్బందులకు గురవుతున్నారు. చేసేదేమీ లేక కొందరు ఎవరికి వారుగా ఇళ్ల నుంచి టేబుల్‌ఫ్యాన్లు తెచ్చుకుని బెడ్ పక్కన ఏర్పాటు చేసుకుని ఉక్కపోత నుంచి ఉపశమనం పొందుతున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంగారెడ్డి జిల్లాలోని ఇలాంటి పరిస్థితులు ఎదురవడం గమనార్హం.

అందోలు బీఆర్ఎస్‌కు భారీ షాక్

7లో

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు

మందులు క్షయం

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 'టీబీ' మందుల కొరత!

- పీహెచ్‌సీలు, ట్రీట్‌మెంట్ యూనిట్లలో ఇదే పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న బాధితులు
- పర్యవేక్షణ లోపంతోనే ఈ దుస్థితి!

క్షయ పేరు వింటేనే ఆందోళన మొదలవుతుంది. దీని బారిన పడినవారి అవస్థలు అన్నీ.. ఇన్నీ కావు. ఊపిరితిత్తులు అదిరేలా ఎకదాటిగా దగ్గు రావడం.. బరువు తగ్గడం తదితర లక్షణాలతో తీవ్రంగా అవస్థపడతారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం రావచ్చు. గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ వ్యాధి నివారణకు సకాలంలో మందులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ సంగారెడ్డి జిల్లాలో టీబీ మందులు నిండుకొనడంతో బాధితులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 19 : క్షయ వ్యాధికి సరైన చికిత్స మందులు తీసుకోవడం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. క్షయ నివారణకు ప్రతీ రోజు మందులు వేసుకోవాల్సి ఉంటుంది. రోగి బరువు ఆధారంగా మందులు ఇస్తారు. మందులు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తే క్షయ తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. అయితే, క్షయ నిర్ధారణ పరీక్షల అనంతరం వ్యాధి సోకినట్టు తేలితే ఇవ్వడానికి ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలో మందులు అందుబాటులోలేవు. జిల్లావ్యాప్తంగా ట్రీట్‌మెంట్ యూనిట్లతో పాటు పీహెచ్‌సీల్లో టీబీ మందుల కొరత వేధిస్తున్నట్టు తెలుస్తున్నది. రెండు, నాలుగు, ఆరు నెలల కోర్సులకు సంబంధించి విడివిడిగా ఇచ్చే మందులు నిండుకున్నాయి.

పర్యవేక్షణ లోపమే శాపం

సంగారెడ్డి జిల్లాలో ఆరు క్షయ ట్రీట్‌మెంట్ యూనిట్లు ఉన్నాయి. సంగారెడ్డి,పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట, మిర్జాపూర్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంట్ యూనిట్లు కొనసాగుతున్నాయి. క్షయ బాధితులకు ఆయా ట్రీట్‌మెంట్ యూనిట్ల ద్వారా నిర్ధారణ పరీక్షలు, చికిత్స, మందులు అందిస్తున్నారు. ప్రతీ ట్రీట్‌మెంట్ యూనిట్‌కు ఒక సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్(ఎస్‌టీఎస్) పర్యవేక్షణ అధికారిగా నియమించారు. క్షయ బాధితులకు మందులు పంపిణీ చేసిన వెంటనే సంబంధిత ఎస్‌టీఎస్ విధిగా 'నిక్షయ్ ఔషధి' పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో అందుబాటులో ఉన్న మందుల స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారులకు తెలుస్తుంది. పోర్టల్‌లో నమోదు చేసిన వివరాల ఆధారంగా అవసరమైన మందులను ఎప్పటికప్పుడు సరఫరా చేసే అవకాశం ఉంటుంది. కానీ కొందరు ఎస్‌టీఎస్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆన్‌లైన్‌లో వివరాలను ఎంట్రీ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. రోగికి మందులిచ్చిన వెంటనే ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయకపోవడంతో, స్టాక్ ఉన్నట్టు భావించి పైనుంచి మందులు పంపడం లేదని తెలుస్తున్నది. జిల్లాలో కొత్తగా క్షయ కేసులు గుర్తించాలని సిబ్బందికి సూచిస్తున్న వైద్యాధికారులు మందుల కొరత గురించి పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సైతం క్షయ నివారణ కార్యక్రమంపై పర్యవేక్షణ చేయడం లేదనే ఆరోపణలున్నాయి.

బాధితుల జేబులకు చిల్లు

క్షయ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే మందులను ఇవ్వకపోవడంతో ప్రైవేటు మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తున్నది. దీంతో బాధితుల జేబులకు చిల్లు పడుతున్నది. ఉన్నతాధికారులు స్పందించి క్షయ రోగులకు అవసరమైన మందులు త్వరితగతిన సరఫరా చేయాలని కోరుతున్నారు.

సర్దుబాటు చేస్తున్నాం

సంగారెడ్డి జిల్లాలో క్షయ బాధితులకు అందజేసే మందుల కొరత ఉన్నమాట వాస్తవమే. పీహెచ్‌సీల్లో నిల్వ ఉన్న మందులను ప్రస్తుతం రోగులకు సర్దుబాటు చేస్తున్నాం. ఇప్పటికే జిల్లాకు అవసరమైన మందుల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పంపించే అవకాశం ఉన్నది.

-డా.రాజేశ్వరి, సంగారెడ్డి జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్

సిద్దిపేట జిల్లా ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

ములుగు, ఏప్రిల్ 19: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా ములుగు మండలం క్షీరాసాగర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావును శుక్రవారం హైదరాబాద్‌లో శ్రీనివాస్ కలిసి సన్మానించారు.

అందోలు బీఆర్ఎస్‌కు భారీ షాక్

● బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు

జోగిపేట, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల వేళ అందోలు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీకి భారీ నష్టం కలగనున్నది. ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనుండగా, మరికొందరు బీజేపీ గూటికి చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దామోదర్ రాజనర్సింహ భారీ విజయం సాధించి, మంత్రి పదవి పొందాక పలువురు బీఆర్ఎస్ నాయకులు, అందోలు-జోగిపేట మున్సిపల్ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఉత్సుకత చూపించినా దామోదర్ ప్రోత్సహించలేదు. గత నెలరోజులుగా కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల నేపథ్యంలో మంత్రి దామోదర్ తన శైలికి భిన్నంగా ఆపరేషన్ ఆకర్ష్‌కు తెర లేపారు. చేరికల విషయంలో దామోదర్ నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో తనకు నమ్మకంగా పని చేసిన కాంగ్రెస్ నాయకుల వార్డుల్లో వారికి ఇబ్బంది అనిపించే నాయకులెవరినీ కాంగ్రెస్‌లో చేర్చుకోవడానికి ఇష్ట పడడం లేదు. ప్రజల్లో పెద్దగా ప్రజాదరణ లేని నాయకులను కూడా చేర్చుకోవడం లేదు.

కాంగ్రెస్‌లో చేరే నేతలు వీరే..

అందోలు-జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మన్ మేతరి ప్రవీణ్, కౌన్సిలర్లు పిట్ల భాగ్యలక్ష్మిలక్ష్మణ్ దంపతులు, పడిగె సుమిత్రా సత్యం దంపతులు కాంగ్రెస్‌లో చేరేందుకు దామోదర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రాయికోడ్ మండలానికి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్ధన్నపాటిల్, జడ్పీటీసీ మల్లికార్జున్‌పాటిల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు. సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ నివాసంలో శనివారం కాంగ్రెస్‌లో చేర్చుకోనున్నారు.

బీజేపీ గూటికి ఇద్దరు కౌన్సిలర్లు

ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీజేపీలో చేరనున్నారు. అందోలు మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల ధనలక్ష్మిఅనిల్‌కుమార్ దంపతులు, పులుగు లక్ష్మీబాయికిష్టయ్యతో పాటు ఆమె కుమారుడు పులుగు గోపాల్‌రావు బీజేపీలో చేరనున్నారు. ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో శనివారం బీజేపీలో చేరనున్నారు.

మోదీ చేతుల్లోనే దేశ భవిష్యత్తు

● బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు



నంగునూరు మండలం కోనాయిపల్లిలో వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న రఘునందన్‌రావు

నంగునూరు, ఏప్రిల్ 19: దేశ అభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యమవుతుందని మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయపల్లి, తిమ్మాయపల్లి, భాషగూడెం, నర్మెట, నంగునూరు గ్రామాల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ నేతలు రైతుల నుంచి వందల ఎకరాల భూమి లాక్కున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలు కేసీఆర్‌కు, హరీశ్‌రావుకు సంబంధించిన ఎన్నికలు కావన్నారు. కేంద్రంలో బీజేపీ గెలిస్తేనే దేశం అభివృద్ధి చెందడంతో పాటు మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కేసీఆర్ కూతురు లిక్కర్ దందా చేసి జైలుకెళ్లిందని విమర్శించారు. నంగునూరు మండలంలో హరీశ్‌రావు పామాయిల్ తోటలు తప్ప అభివృద్ధి చేసింది ఏమీ లేదని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నందునే సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి వరకు నేషనల్ హైవేను ఏర్పాటు చేశారని, సిద్దిపేటకు రైలు తీసుకు వచ్చిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కులం పేరు చెప్పుకుంటూ ఓట్ల కోసం ముందుకు వస్తున్నారని విమర్శించారు. కులాల ప్రతిపాదికన బీజేపీ ముదిరాజులకు మూడు సీట్లు ఇచ్చిందన్నారు. అంతకు ముందు కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో రఘునందన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు దూది శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు రజనీకర్‌రెడ్డి, పేరాల తిరుపతిరావు, వాసర యాదమల్లు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ప్రచార రథం.. ఒకరి మృతి

గజ్వేల్, ఏప్రిల్ 19: ట్రాక్టర్‌ను ప్రచార రథం ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన సొక్కి మల్లేశం(43) శుక్రవారం తన ట్రాక్టర్‌ను నడుపుకుంటూ ప్రజ్ఞాపూర్ వైపు వెళ్తుండగా వెనకాల నుంచి వచ్చిన ఓ పార్టీకి చెందిన ప్రచార రథం ఢీకొట్టింది. ప్రమాదంలో మల్లేశం అక్కడికక్కడే మృతిచెందాడు. మల్లేశంకు భార్య కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు. ప్రచార రథం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీల్లో పరిశుభ్రత పాటించాలి: డీపీవో



రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీవో

జహీరాబాద్, ఏప్రిల్ 19: పంచాయతీల్లో అందరూ పరిశుభ్రతను పాటించేలా కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తూంకుంట పంచాయతీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డంపింగ్ యార్డులు, వైకుంఠధామాల వినియోగం, నర్సరీల్లో మొక్కల పెంపకం తదితరాలపై ఎంపీఈవో మహేష్, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్యలపై మండలస్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. తూంకుంట పంచాయతీలో పలురికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీరప్ప, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరగడానికి బీఎల్‌వోలే కీలకం: ఆర్డీవో

కల్హేర్/సిర్గాపూర్/నారాయణఖేడ్, ఏప్రిల్ 19: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి బీఎల్‌వోల పాత్ర కీలకమని నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి పేర్కొన్నారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో శుక్రవారం బీఎల్‌వోల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వ యంత్రాంగం విశేష కృషి చేస్తుందని, క్షేత్రస్థాయిలో బీఎల్‌వోల పాత్ర కీలకమని తెలిపారు. ఓటరు స్లిప్‌లను సకాలంలో ఓటర్లకు అందజేసి వారు ఓటు వేసే విధంగా ప్రాముఖ్యాన్ని తెలియపర్చాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయలేని పరిస్థితుల్లో ఉన్న వారికి ఇంటి వద్దే ఓటు వేసే విధంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకున్నందున, అలాంటి ఓటర్లను గుర్తించి ఈ కార్యక్రమాన్ని బీఎల్‌వోలు విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసే విధంగా వంద శాతం పోలింగ్ నమోదుకు బీఎల్‌వోలు కృషి చేయాలని ఆర్డీవో అశోక చక్రవర్తి తెలిపారు. సమావేశాల్లో కల్హేర్, సిర్గాపూర్ తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, ఉమాశంకర్, సిర్గాపూర్ ఎంపీడీవో మల్సూర్ నాయక్ పాల్గొన్నారు.



కల్హేర్‌లో బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం

నర్సాపూర్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల కోసం వృద్ధులు, దివ్యాంగులు ఇంటి దగ్గరే ఉండి ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాటు చేసినట్లు నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే 3వ తేదీ నుంచి 85సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్ద నుంచే ఓటు వేసే విధంగా ఇదివరకే నియోజకవర్గంలో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి, వారి అభిప్రాయం మేరకు ఓటు వేసే వారి సమ్మతిని తీసుకున్నట్లు చెప్పారు. ఇంకా ఎవరైనా అటువంటి వారు ఉంటే ఈ నెల 24వ తేదీలోపు సంబంధిత బీఎల్‌వోలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



సురేష్ దావులే (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 19: మండలంలోని రుక్మాపూర్ గ్రామ శివారులో రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడి తలకు తీవ్ర గాయాలై గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. చేగుంట ఎస్‌ఐ బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కన్యారం గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద మహారాష్ట్ర కురులా గ్రామానికి చెందిన సురేష్ దావులే(24) పని చేస్తున్నాడు. ఈ నెల 14న చేగుంట నుంచి ఇటుక బట్టీల వద్దకు బైక్‌పై అతడు వస్తుండగా రుక్మాపూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడటంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి అశోక్ దావలే ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్‌ఐ బాలరాజ్ కేసు దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం



చాకలి భాగమ్మ



చాంద్‌పాషా

వెల్దుర్తి/శివ్వంపేట, ఏప్రిల్ 19: మెదక్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. వెల్దుర్తి మండలంలోని మనెపల్లి గ్రామానికి చెందిన చాకలి భాగమ్మ (50) సమీప అటవీ ప్రాంతంలో తునికాకు తేవడానికి వెళ్లి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మనెపల్లి గ్రామానికి చెందిన చాకలి భాగమ్మ గురువారం ఉదయం 10 గంటలకు తునికాకు సేకరణకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. గురువారం రాత్రి అటవీ ప్రాంతంలో ఎంత వెతికినా కనిపించలేదు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ నవతగౌడ్‌ను వివరణ కోరగా మహిళ అదృశ్యంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. అదేవిధంగా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన డీసీఎం డ్రైవర్ చాంద్‌పాషా ఈ నెల 11వ తేదీన రంజాన్ సందర్భంగా స్నేహితుల వద్దకు వెళ్లి ఇంతవరకు తిరిగిరాలేదు. శుక్రవారం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

'ప్రజాభిప్రాయం' లేకుండానే పరిశ్రమ ఏర్పాటు చేస్తారా?

● వ్యతిరేకిస్తున్న దిగ్వాల్ గ్రామస్థులు



స్టీల్ ఫ్యాక్టరీ కోసం భూమి పూజ నిర్వహించిన దృశ్యం

కోహీర్ ఏప్రిల్ 19: సంగారెడ్డి కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామ శివారులో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం శుక్రవారం ఉదయం భూమి పూజ నిర్వహించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వకుండా, ప్రజాభిప్రాయ సేకరణ జరపకుండా తమ గ్రామంలో పరిశ్రమ ఏర్పాటుకు రహస్యంగా భూమిపూజ ఎలా చేస్తారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దిగ్వాల్ గ్రామంలోని 89 సర్వే నంబర్‌లో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం టీఎస్‌ఐఐసీ(తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) వారు 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. అయితే మొదట్లో అట్టి భూమిని సర్వే చేసేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామస్థులు వ్యతిరేకించారు. అయినప్పటికీ స్థానికులకు ఉపాధి లభిస్తుందని అధికారులు వారికి నచ్చజెప్పి ఒప్పించారు. అనంతరం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని సర్వే చేసి సంబంధిత పరిశ్రమ ఏర్పాటు కోసం యాజమాన్యం వారికి అప్పగించారు. అయితే ఎవరికీ సమాచారం లేకుండా భూమిపూజ చేయడంపై వ్యతిరేకించారు. తక్షణమే అధికారులు స్పందించి పరిశ్రమ యాజమాన్యం వారితో గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని దిగ్వాల్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కాగా ఈ విషయమై జహీరాబాద్ ఆర్డీవో రాజును సంప్రదించగా దిగ్వాల్ గ్రామంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు భూమి పూజ చేసే సమాచారం కూడా తమకు తెలియదన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఎలాంటి అనుమతులు ఉన్నాయో తెలుసుకుని అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కనుల పండువగా జోగినాథుని రథోత్సవం



జోగిపేటలో రథం ఊరేగింపు

జోగిపేట, ఏప్రిల్ 19: సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని జోగినాథస్వామి రథోత్సవం గురువారం రాత్రి కన్నులపండువగా జరిగింది. గౌని కూడలి వద్ద ఉంచిన రథానికి ఈ నెల 15న శిఖర స్థాపన జరిపారు. అనంతరం రథాన్ని వివిధ రంగులతో, విద్యుత్ తోరణాలతో అలంకరించి, గురువారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథాన్ని తాళ్లతో లాగారు. గౌని చౌరస్తానుంచి ప్రారంభమైన ఈ రథం పోచమ్మ దేవాలయం, పోచమ్మ వీధుల గుండా జోగినాథ కూడలి నుంచి దేవాలయం వరకూ చేరింది. రథోత్సవం సందర్భంగా జోగిపేట సీఐ అనిల్ కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ అరుణ్‌గౌడ్ తమ సిబ్బందితో పాటు, సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, రథోత్సవ కమిటీ చైర్మన్ శివశంకర్, కమిటీ సభ్యులు సురేందర్‌గౌడ్, రంగ సురేశ్, చింతల సురేశ్‌గుప్తా, రెడ్డిపల్లి బ్రహ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం, మాజీ ఎంపీటీసీ శివశేఖర్, డీజీ వెంకటేశం, కౌన్సిలర్లు చిట్టిబాబు, దుర్గేశ్, నాగరాజు, ధనలక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో మిస్టరీ వీడని ఉపాధ్యాయుడి అదృశ్యం



నాగరాజు

మాసాయిపేట, ఏప్రిల్ 19: మాసాయిపేట మండల కేంద్రంలో నెల క్రితం అదృశ్యమైన జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.నాగరాజు ఉదంతం నేటికీ కొలిక్కి రాలేదు. వివరాల్లోకి వెళ్తే.. మాసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎం.నాగరాజు గత నెల 28న అదృశ్యమయ్యారు. కుటుంబ సభ్యులకు గానీ, పాఠశాల సిబ్బందికి గానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే గుడ్ ఫ్రైడే నుంచి గైర్హాజర్ అయినట్లు కుటుంబ సభ్యులు చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమై సుమారు నెలరోజులు గడుస్తున్నా నాగరాజు అదృశ్యం మిస్టరీ వీడలేదు. తమ తండ్రి అదృశ్యం కేసును త్వరగా కొలిక్కి తేవాలని కుటుంబ సభ్యులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వస్వం కోల్పోయాం.. ఇళ్ల స్థలాలివ్వండి

● పెద్దారెడ్డిపేటలో ముంపు బాధితుల ఆందోళన



నిరసన తెలుపుతున్న పెద్దారెడ్డిపేట ముంపు బాధితులు

పుల్‌కల్, ఏప్రిల్ 19: మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన ముంపు బాధితులు శుక్రవారం గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగూరు ప్రాజెక్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోయాం.. 30 ఏళ్లు గడిచినా మాకు ఇళ్ల స్థలాలు ఎందుకివ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెద్దారెడ్డిపేట గ్రామం పూర్తిగా ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురైనప్పటికీ, అధికారులు సగం గ్రామానికి మాత్రమే నష్ట పరిహారం చెల్లించి, మిగితా సగం గ్రామాన్ని వదిలేశారని వివరించారు. మిగిలిపోయిన గ్రామాన్ని కూడా ముంపుగా ప్రకటించి ఇళ్లకు నష్టపరిహారం అందజేయాలంటూ అప్పటి ఉమ్మడి రాష్ట్ర డిప్యూటీ సీఎం, ప్రస్తుత మంత్రి దామోదర రాజనరసింహకు విజ్ఞప్తి చేయగా పాత పెద్దారెడ్డిపేటను పూర్తిగా ముంపు గ్రామంగా ప్రకటించారని గుర్తుచేశారు. అప్పట్లో మొదటి విడతగా ప్రభుత్వం గ్రామస్థులకు నష్టపరిహారం చెల్లించింది, ఆ పరిహారం ఏ మాత్రం సరిపోవడంలేదంటూ గ్రామస్థులు కోర్టును ఆశ్రయించారు. ఇటీవల రెండో విడతగా మళ్లీ పరిహారం చెల్లించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ శివారులో రెండున్నర ఎకరాల భూమిని ముంపు బాధితుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. ప్రస్తుతం ఆ భూమిలో తమకు ఇళ్ల స్థలాలకు కేటాయిస్తే పక్కా ఇళ్లను నిర్మించుకుంటామని ముంపు బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు కేటాయించిన స్థలంలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయమై త్వరలో కార్యాచరణ రూపొందిస్తామని ముంపు బాధితుల తరఫున ఉద్యమిస్తున్న కుమ్మరి లింగయ్య తెలిపారు.

ప్రారంభమైన బీరప్ప జాతర

ఝరాసంగం, ఏప్రిల్ 19: మండల పరిధిలోని గుంతమర్పల్లి గ్రామంలో ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు బీరప్ప ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో భాగంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు మందపోచమ్మ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 21న స్వామి వారికి బోనాలు, 22న బీరప్ప కల్యాణం, 23న నాగవెల్లి కథలు, 24 గడపలు కడుగుట తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

కొల్చారం, ఏప్రిల్ 19: మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలిక వివాహాన్ని శుక్రవారం కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అనంతరం మైనర్ బాలికను కొల్చారం పోలీసులు ఐసీడీఎస్ అధికారులు మెదక్‌లోని సఖీ కేంద్రానికి తరలించారు. గ్రామాలలో ఎక్కడైనా బాలికలకు వివాహం జరిగితే టోల్‌ఫ్రీ నంబరు 1098కి సమాచారం ఇవ్వాలని జిల్లా బాలిక సంరక్షణ అధికారి కరుణశీల తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష, ఐసీడీఎస్ ఔట్‌రిచ్ వర్కర్లు సరిత, శంకర్ ఉన్నారు.

వైభవంగా సీతారాముల రథోత్సవం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 19: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా పెద్దశంకరంపేటలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు సీతారాముల రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య హోమం, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సీతారాముల లక్ష్మణ విగ్రహాలను రథంపై ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం పరిశీలించిన అదనపు కలెక్టర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిజాంపేట, ఏప్రిల్ 19: 'అకాల వర్షం... ఆగమాగం' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అదనపు కలెక్టర్ స్పందించారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో తడిసిన పంటను చూశారు. ఈ సందర్భంగా అక్కడే బాధితులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం తూకం వేసిన వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సీఈవో శోభారాణికి సూచించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ బాపురెడ్డి రైతులు, తదితరులు ఉన్నారు.

'ఆయిల్‌పామ్' అన్నిరకాల నేలలకు అనుకూలం



కాశీంపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న సంగారెడ్డి జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

జహీరాబాద్, ఏప్రిల్ 19: ఆయిల్‌పామ్ పంటలు అన్నిరకాల నేలలకు అనుకూలమని జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాశీంపూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగువిధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంట సాగుకుగాను రైతులకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రాయితీ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆయిల్‌పామ్ మొక్క ఒక్కొంటికి మార్కెట్లో రూ.250 చొప్పున ధర ఉండగా, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రూ.20 చొప్పున అందజేస్తున్నామన్నారు. అలాగే నాలుగు సంవత్సరాల పాటు ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటిన పొలంకు ఎకరాకు రూ.4,200 చొప్పున అంతరపంట సాగు కోసం ఆర్థికసహాయం అందజేస్తామన్నారు. ఒక్కో కుటుంబానికి 12ఎకరాలవరకు రాయితీ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఆయిల్ పాం పంటను సాగుచేయడం వల్ల ఎకరానికి రైతుకు రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. పంట చేతికొచ్చాక గోద్రేజ్ ఆగ్రోటెక్ కంపెనీవారు నేరుగా రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తారని ఆయన వివరించారు. రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపాలన్నారు. పలువురు రైతులకు ఆయిల్‌పాం మొక్కలు, జనుములను అందజేశారు. కాశీంపూర్‌లో ఆయిల్‌పాం మొక్కలను సాగుచేస్తున్న రైతుల పంటపొలాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట నియోజకవర్గ ఉద్యానశాఖ అధికారి శైలజ, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మకు బోనాలు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 19: మండలంలోని గవ్వపల్లి గ్రామంలో శుక్రవారం పోచమ్మకు మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం నిర్వాహకులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కంది, ఏప్రిల్ 19 : మండలంలోని కాశీపూర్‌లో జైళ్లశాఖ ఏర్పాటు చేసిన ఇండియన్ పెట్రోల్ బంక్‌లో(మైనేషన్ ఫిల్లింగ్ స్టేషన్) అగ్ని ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లోని సిబ్బందికి అగ్ని ప్రమాదం జరిగినపుడు స్పందించాల్సిన విధానాన్ని వివరించారు. పెట్రోల్ బంక్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం బాధాకరం

రామాయంపేట, ఏప్రిల్ 19: వెంకటాపూర్‌లో అంబేడ్కర్ చూపుడు వేలు ధ్వంసం చేయటం బాధాకరమని ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గ్రామానికి చేరుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడే దళితులతో మాట్లాడుతూ అనువైన స్థలాన్ని గుర్తించి, అతిత్వరలోనే అంబేడ్కర్ విగ్రహస్థాపన చేసేందుకు అందరూ ఒక్కటిగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

అందరూ సమన్వయంతో మెలగాలి: మైనంపల్లి

రామాయంపేట, ఏప్రిల్ 19: అంబేడ్కర్ విగ్రహ ధ్వంసం విషయంలో దళితులు సమన్వయంతో మెదలాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారు. శుక్రవారం ఆయన వెంకటాపూర్ గ్రామంలో చూపుడు వేలు ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం దళితులతో సమావేశమై అనువైన స్థలాన్ని ఎంపిక చేసి విగ్రహ స్థాపన చేసేందుకు తాను కృషి చేస్తానన్నారు. గ్రామంలో ఈ విషయమై ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

నర్సాపూర్, ఏప్రిల్ 19: నర్సాపూర్ పట్టణంలోని 15వ వార్డుకు చెందిన రాజనాలపాపయ్య, బాలరాజ్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు శుక్రవారం నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ హబీబ్‌ఖాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా మెదక్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలంమధు నామినేషన్ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సభకు నర్సాపూర్ నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని మదన్‌రెడ్డి కోరారు.

● వెల్దుర్తి: మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి రానున్నందున నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో యాన్యువల్ డే

కొండాపూర్, ఏప్రిల్ 19: ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలు తల్లిపిల్లల అనురాగ వేదికలుగా నిలిచాయని సీడీపీవో రేణుక పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ అరుణ నిర్వహించిన యాన్యువల్‌డే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఐదేళ్లలోపు చిన్నారులకు బోధనతోపాటు ఆహారపోషకాలతో కూడిన భోజనం, ఆటపాటలను నేర్పుతూ చిన్నారుల ఎదుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయని సీడీపీవో రేణుక కొనియాడారు. పూర్వప్రాథమిక విద్య స్థాయిలో సాధించిన ఘనతను, చాటి చెప్పేందుకు,అబ్జర్వేషన్ బుక్స్, అసెస్మెంట్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. చిన్నారుల మెడలో మెడల్స్ వేసి వారిని ప్రశంసిస్తూ సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల, అసిస్టెంట్ అనిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నారాయణఖేడ్, ఏప్రిల్ 19: ఖేడ్ పట్టణానికి చెందిన పలువురు మైనార్టీలు శుక్రవారం జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా ఖేడ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ సమక్షంలో సిర్గాపూర్ మండలం చందర్‌నాయక్ తండా గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు లక్ష్మణ్‌నాయక్‌తో పాటు ఆయన అనుచరులు బీఆర్ఎస్ నుంచి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

విజయపాల్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరికలు

నారాయణఖేడ్, ఏప్రిల్ 19: నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లి మేగ్యానాయక్ తండాకు చెందిన పలువురు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు బీజేపీ పాలన కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద జడ్పీటీసీ రాజు రాథోడ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఉన్నత విద్యావంతుడిని గెలిపిస్తే ప్రజలకు న్యాయం

పటాన్‌చెరు, ఏప్రిల్ 19: ఉన్నత విద్యావంతుడు, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు పూర్తి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి శుక్రవారం పటాన్‌చెరు ప్రాంత సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను కలుసుకుని మద్దతు కోరారు. పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ, ఎం.జైపాల్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సపానాదేవ్, శంకర్‌యాదవ్ తదితరులతో సమావేశమై బీఆర్ఎస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు అభ్యర్థి వెంకట్‌రాంరెడ్డికి పూర్తి మద్దతు పలికారు. అనంతరం వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ రైతాంగ సమస్యలు, అన్నివర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు

సాదాసీదాగా నిజాంపేట
మండల సర్వసభ్య సమావేశం

నిజాంపేట, ఏప్రిల్ 19: ఎన్నికల నేపథ్యంలో సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించినట్టు ఎంపీపీ దేశెట్టి సిద్ధిరాములు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులపై సభలో నివేదిక చదివారు. కాగా సమావేశానికి మండల ఎంపీటీసీలు కేవలం ముగ్గురే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ సిద్ధరాములు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎలాంటి తీర్మానాలు లేకుండానే తొందరగా ముగించామన్నారు. అనంతరం ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నంద్యాల బాల్‌రెడ్డి మాట్లాడుతూ నామమాత్రంగా ముగ్గురు ఎంపీటీసీలతో సమావేశాన్ని నిర్వహించి తొందరగా ముగించడం సరికాదన్నారు. సమావేశాన్ని మళ్లీ జరపాలని ఎంపీడీవో రాజురెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లద్ద సురేష్, ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సతీష్, ఎంపీవో రాజేందర్, మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, పీఆర్ ఏఈ శరత్, వైద్య, వెటర్నరీ అధికారులు హరిప్రియ, సుధాకర్ ఆయా శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

టేక్మాల్, ఏప్రిల్19: రైతులకు చిరుధాన్యాలపై అవగాహన సదస్సును మండలంలోని కూసంగి గ్రామంలో మండల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం 2021లో ఐసీఏఆర్- భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్- ఐఐఎంఆర్), ఎన్‌సీడీసీ, అటారీ జోన్10, హైదరాబాద్ శాస్త్రవేత సంగప్ప, రఫీ అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిరుధాన్యాల ద్వారా పంటల వైవిధ్యం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సహకారం సంఘం, చైర్మన్ మొగలయ్య, సీఈఓ వెంకటేశం, ఏఈఓ ఇంద్రయ్య, మొగలిరెడ్డి, యూసుఫ్, కే సంగమేశ్వర్‌గౌడ్, అంజయ్య, వీరారెడ్డి, మహిపాల్ రెడ్డి, సత్యగౌడ్, రామకృష్ణారెడ్డి, సుభాష్, అనిల్‌గౌడ్, రాములు, సాయిలు , కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పాలిటెక్నిక్'కు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, ఏప్రిల్ 19: వివిధ పాలిటెక్నిక్ కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు గాను రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ పాలిసెట్ -2024 ప్రకటన విడుదల చేసిందని ఖేడ్‌ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రవేశపరీక్ష రాయడానికి అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఇతర విద్యార్థులు రూ.500 చెల్లించి ఈ నెల 22వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశపరీక్ష మే 24న నిర్వహించనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8143504002 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

పెద్దచెల్మెడలో జొన్నల కొనుగోలు కేంద్రం

మునిపల్లి, ఏప్రిల్ 19: మండల పరిధిలోని పెద్దచెల్మెడ కాలనీలోని పీఏసీఎస్ సహకార సంఘంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఏవో శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈవోలు రహమాన్, సంగీత, మహేందర్, పీఏసీఎస్ కార్యదర్శి శివకుమార్,సిబ్బంది వినోద్, సురేందర్ తదితరులుపాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి అత్యంత కీలకమైనది

మాసాయిపేట, ఏప్రిల్ 19: భవిష్యత్ తరాలను, యువతను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని మాసాయిపేట మండల విద్యాధికారి యాదగిరి పేర్కొన్నారు. మండల కేంద్రమైన మాసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మీర్ ముంతాజ్ అలీ పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ వీడ్కోలు సమావేశానికి మండల విద్యాధికారి యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై పదవీ విరమణ చేస్తున్న ముంతాజ్ అలీ ని సన్మానించారు. సమావేశంలో పాల్గొన్న పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు రామారావు శ్రీనివాస్ రంగారెడ్డి శ్రీకాంత్ నవీన్ హరిరంజన్ తదితరులు ముంతాజ్‌అలీని ఘనంగా శాలువాలతో సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ ఘటనలో మరో ఇద్దరి అరెస్ట్

మనోహరాబాద్, ఏప్రిల్ 19: తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించిన ఘటనలో గతంలో ఒకరిని అరెస్టు చేయగా, శుక్రవారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ సంఘటన మండలంలోని కూచారంలో చోటు చేసుకుంది. తూప్రాన్ సీఐ రెడ్డబోయిన కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూచారం శివారులో హైదరాబాద్‌కు చెందిన ఎస్. సత్యనారాయణమూర్తి ప్లాట్ కొనుగోలు చేశాడు. ప్లాట్ వద్దకు వెళ్లిన సత్యనారాయణమూర్తికి మోసంతో తప్పుడు ధ్రువపత్రాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించాడు. దాంతో ఫిబ్రవరి 13న మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఈనెల 7న హైదరాబాద్‌కు చెందిన నిందితుడు ఖందపల్లి రాజేశ్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లికి చెందిన వీరపనేని మధుసూదన్‌రావు, హైదరాబాద్‌కు చెందిన వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.